డెంగ్యూ నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి 8
అల్ఫోర్స్‌లో ఆకట్టుకున్న బోనాల జాతర 8

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు



● ఆశ...నిరాశలను మిగిల్చిన నిర్మలా సీతారామన్ ● అభిప్రాయాలు వెల్లడించిన జిల్లా నేతలు

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2024-25 సాధారణ బడ్జెట్‌పై బిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. కేంద్ర బడ్జెట్ కొందరిలో ఆశలను కలిగించగా, మరికొందరిని నిరాశ నిస్పృహలకు గురిచేసింది. సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు దేశ రైతాంగం, సామాన్యులు, పేదలు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని కొందరు అభిప్రాయ పడుతుండగా, దశ దిశ, నిర్దేశం లేని నిష్ప్రయోజకర బడ్జెట్‌గా ఉందని మరికొందరు ఆక్షేపించారు. కేంద్ర ప్రభుత్వం పలు రంగాలను ప్రోత్సహించడం, సామాన్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను రూపొందించిందని కొందరు ఖితాబు ఇవ్వగా, కేంద్రం మసిపూసి మారేడు కాయ చేసిన గోల్‌మాల్ బడ్జెట్ ఇదని మరికొందరు ధ్వజమెత్తారు. లోక్ సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లాకు చెందిన పలువురి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి...

తెలంగాణకు మొండి చేయి

దావ వసంత, జడ్పీ మాజీ చైర్‌పర్సన్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి మిగిలింది. రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌ను నిరాశను మిగిల్చింది. తెలంగాణ ప్రస్తావనే లేని బడ్జెట్‌గా ఇది చరిత్రలో నిలిచిపోతుంది. రైల్ కోచ్ ఫ్యాక్టరీ, వ్యవసాయ రంగం ప్రాధాన్యత గురించి బడ్జెట్‌లో ప్రస్తా వించలేదు. ఈ బడ్జెట్ కేవలం బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంక్షేమ బడ్జెట్‌గా మాత్రమే మిగిలింది.

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్

బోగ శ్రావణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు



లోక్‌సభలో మంత్రి నిర్మలా సీతారామన్ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. వచ్చే ఐదేళ్లలో సుమారు 20 లక్షల మంది యువతకు నైపుణ్యాల శిక్షణ, 500 పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌లు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 3 కోట్ల అదనపు ఇళ్ల నిర్మాణం, ముద్ర రుణాలు, మహిళలు, బాలికలకు ప్రత్యేక బడ్జెట్, కొత్త ఉద్యోగులకు మూడు ప్రోత్సాహకాలు ఇలా అన్ని వర్గాలకు మేలు కలిగేలా బడ్జెట్ రూపకల్పన జరిగింది.

పెన్షనర్లను నిరాశ పర్చిన కేంద్ర బడ్జెట్

హరి అశోక్ కుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



కేంద్ర బడ్జెట్ పెన్షనర్లను తీవ్రంగా నిరాశ పరిచింది. పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలన్న డిమాండ్‌ను పట్టించుకోలేదు. ప్రతి నెల ప్ర భుత్వం ఇచ్చే గౌరవ భృతి పెన్షన్‌పై ఆదాయపు పన్ను విధించడం సరికాదు. కనీసం పరిమితిని సైతం ఉద్యోగులకు, పెన్షనర్లకు పెంచకపోవడం నిరాశ పరిచింది.

విద్యా, నైపుణ్య అభివృద్ధికి నిధులు చాలా తక్కువ

తులసి ఆగమయ్య, టీఎస్ యూటీఎఫ్, రాష్ట్ర నాయకులు



కేంద్ర బడ్జెట్‌లో విద్య, నైపుణ్య అభివృద్ధికి కేటాయించిన నిధులు చాలా తక్కువగా ఉన్నాయి. జాతీయ స్థాయిలో విద్యా రంగానికి 12 శాతం నిధులు కేటాయి స్తే విద్యా రంగానికి ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కేవలం 3 శాతం మాత్రమే కేటా యించడం ఆందోళన కలిగిస్తోంది. నూతన ఆదాయపు పన్ను విధానం ప్రకారం వేతన జీవులకు స్వల్ప ఊరట ఇస్తుంది.

నవోదయ పాఠశాలల మాటే ఎత్తలేదు

బోగోజు ముఖేశ్ ఖన్నా, కాంగ్రెస్ సేవా దళ్ జిల్లా అధ్యక్షుడు, జగిత్యాల



కేంద్ర బడ్జెట్‌లో నవోదయ పాఠశాలలు, గిరిజన విశ్వ విద్యాలయం ఊసు ఎత్తు లేదు. పునర్విభజన చట్టం ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాలను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభు త్వం ఆంధ్ర ప్రదేశ్‌కు రూ. 15 వేల కోట్లు కేటాయించి, తెలంగాణకు మొండిచేయి చూపింది.

ఊరించి ఉసూరు మనిపించింది

తిరుక్కోవెల శ్యామ్ సుందర్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



పాత పన్ను విధానానికి ఆదాయ పన్ను పరిమితి పెంచితే మధ్య తరగతి, ఉద్యోగులకు ఉపయోగంగా ఉండేది. కొత్త పన్ను విధానంలో ఆదాయ పన్ను మి నహాయింపు అనేది కేవలం కంటి తుడుపు చర్యగానే బావించాలి. ఈ పెంపు కేవలం అధిక ఆదాయం అంటే రూ. 20 లక్షలు ఆ పైన ఆదాయం కలవారికే అనుకూలంగా ఉంటుంది. పేద ప్రజలకు ఊరించి ఊసురు మనిపించింది అని చెప్పవచ్చును.

తెలంగాణకు మొండి చేయి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు వరాల జల్లు, తెలంగాణకు మొండి చేయి చూపించారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన ఫోన్ ద్వారా మాట్లాడారు. తెలంగాణ ప్రాంత డిమాండ్లయిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, నవోదయ, సైనిక్ సూళ్లు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై కేటా యింపులు జరగలేదన్నారు. రాష్ట్రంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులైన కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులలో ఏదైనా ఒక ప్రాజెక్టు జాతీయ హోదాలపై కేంద్రం తెలంగాణ రాష్ట్రం పట్ల వివక్ష చూపించిందన్నారు.

ఉద్యోగ అవకాశాలు పెంచుతామనడం ఆశాజనకం

అంబటి భూమేశ్వర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు



కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగ అవకాశాలు పెంచుతామనడం ఆశాజనకంగా ఉంది. నిరుద్యోగులకు కొంత ఊరట కలిగించేలా కనిపించింది. స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇస్తామనడం యువతకు మరింత ఊరించే విషయంగా మారింది. కొత్త పన్ను విధానంలో ఆదాయపన్ను మినహాయింపు అనేది కేవలం కంటి తుడుపు చర్యగానే బావించాలి.

యువత, రైతు సంక్షేమానికి పెద్ద పీట వేయడం హర్షనీయం

అయిత అనిత, కవయిత్రి, జగిత్యాల



ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ వికసిత భా రత్ లక్ష్యంగా అన్ని రంగాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించనుండడం సంతోషకరం. విద్యా ఉపాధి నైపుణ్యంలో భాగంగా ఐటీఐలను ఏర్పాటు చేసి భారీగా యువతను ప్రోత్సహించడం, వ్యవసాయానికి పెద్దపీట వేయడం హర్షించదగ్గ విషయము.

సీఎంను కలిసిన ప్రభుత్వ విప్



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న విప్ అడ్లూరి

ధర్మపురి, జూలై 23: అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వారందరికి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేయగా తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు.

అంజన్నను దర్శించుకున్న ఎస్పీ



ఆలయంలో ఎస్పీని ఆశీర్వదిస్తున్న అర్చకులు

మల్యాల, జూలై 23: జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అధికారులు శాలువతో సత్కరించారు. ఎస్పీ వెంట సీఐ నీలం రవి, ఎస్సై నరేష్ కుమార్, ఏఎస్సై రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

మద్యం మత్తులో కాలువలో పడి గూర్ఖా మృతి

ధర్మపురి, జూలై 23: ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో లోకేందర్ కూన్వర్ (60) అనే గుర్కా తాగిన మైకంలో కాలువలో పడి మంగళవారం మృతి చెందాడు. నెపాల్‌కు చెందిన గుర్కా తల్లిదండ్రులు మృతి చెందగా మూడు సంవత్సరాల నుంచి ఒంటరిగా జైనా గ్రామంలో ఉంటూ గుర్కా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మద్యం సేవించే అలవాటు ఉన్న గుర్కా తాగిన మైకంలో కాలువ ఒడ్డు పైనుండి నడుచుకుంటూ వెళుతుండగా ప్రమాదవశాత్తు కాలువలో జారీ పడి మృతి చెందాడు. మృతుని తమ్ముడు దిలీప్‌సింగ్ కూన్వార్ ఫిర్యాదు మేరకు శవ పంచనామా జరిపి పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పంపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సూర్యనారాయణరాజు తెలిపారు.

సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్

మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి



చైర్ పర్సన్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల టౌన్, జూలై 23 : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రజాదర్బార్‌లో పలువురు తమ సమస్యలను వినతుల రూ పంలో చైర్ పర్సన్‌కు అందజేశారు. 9వ వార్డులో డ్రైనేజీలతో పాటు సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ బీజేపీ నాయకురాలు గడ్డల లక్ష్మి ఆధ్వర్యంలో నాయకురాళ్లు వినతి పత్రం అందజేశారు. ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు చైర్ పర్సన్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అంతకు ముందు మున్సిపల్ పార్కులో పలు అభివృద్ధి పనులను చైర్ పర్సన్ పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సమ్మ య్యతో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

రైస్ మిల్లుల్లో రెండో రోజూ సోదాలు

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో మంగళవారం వరుసగా రెండవ రోజు సివిల్ సప్లయి అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయి శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పలువురు సివిల్ సప్లయి అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్ మిల్లుల్లో దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు 2022-23 యాసంగి, 2023-24 వానాకాలం, 2023-24 యాసంగి సీజన్‌లలో సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా..లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని పలు చోట్ల సోదాలు జరిగాయి. రైస్ మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపారు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్‌డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, జగిత్యాల జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్ రావు, సివిల్ సప్లయి కార్పొరేషన్ మేనేజర్ హతీరాం, జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్, ఈజీఎస్ ఏపీడీ మధన్ మోహన్, తహసీల్దార్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా ఈనెల 22వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సగటున 15.9 మిల్లీ మీటర్ల వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా రాయికల్‌లో 20.4 మిల్లీ మీటర్లు, బీర్‌పూర్‌లో 19.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా వెల్గటూరులో 11.0 మిల్లీ మీటర్లు, ఎండపల్లిలో 12.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని మెట్‌పల్లి 18.8 మిల్లీ మీటర్లు, మల్లాపూర్‌లో 18.0, ధర్మపురి 17.9, బుగ్గారం, జగిత్యాల 17.6, సారంగపూర్ 17.2 జగిత్యాల రూరల్, మేడిపల్లి, బీమారం 16.5, కథలాపూర్ 16.1, ఇబ్రహీంపట్నంలో 15.6, కోరుట్ల 15.2, మల్యాల 13.6, కొడిమ్యాల 13.1, పెగడపల్లి, గొల్లపల్లి, ఎండపల్లి 12.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వరసగా కురుస్తున్న వర్షాల వల్ల జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరుతోంది.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్

మెట్‌పల్లి రూరల్, జూలై, 23 : వర్షాకాలంలోని సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు పరిశుభ్రతను తప్పకుండా పాటించాలని డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో, డీసీజెస్ కంట్రోల్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలోని రామలచ్చక్కపేట గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో పేషెంట్ ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. గ్రామంలోని మురికి కాలువలు, పలు ఇండ్లను పరిశీలించి నిల్వ ఉన్న నీటిని, చెత్తను తొలగింపజేయించారు. వైద్యుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమకాటు ద్వారా విషజ్వరాలు వ్యాప్తిస్తుంటాయన్నారు. సాధారణంగా దోమల బెడద తీవ్రంగా ఉంటుందని, పారిశుధ్యం లోపిస్తే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండకుండా ప్రజలు ఇంటితో పాటు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ అధికారులు మురికి కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు వ్యాప్తి చెందకుండా మొదటి దశలోనే అంతం చేయాలని, పలు సూచనలు చేశారు. ఈయన పంచాయతి కార్యదర్శి సోని, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కార్లు, సిబ్బంది ఉన్నారు.

మల్లాపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకంటే రోగాలు దరి చేరవని డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలం లోని హుస్సేన్‌నగర్, నడికుడ గ్రామాలను సందర్శించారు. డెంగ్యూ పేంషెట్‌ల ఇండ్లను పరిశీలించారు. ఇండ్లలో నిల్వ ఉన్న నీటిని గుర్తించి పారపోయించి, లార్వాలను గుర్తించి వాటిని తొలగింపజేయించారు. పరిసారలలో ఫైరేత్రేమ్‌ను పిచికారీ చేయించారు. ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈయన వెంట మల్లాపూర్ వైద్యాధికారి వాహినిరెడ్డి, ఏంపీవో జగదీష్, వైద్య సిబ్బంది ఉన్నారు.



రామలచ్చక్కపేటలోని మురికి కాలువను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ సత్యప్రసాద్

● మోతె, కండ్లపల్లి చెరువుల మత్తడిలను పరిశీలన

జగిత్యాలరూరల్, జూలై23 : భారీ వర్షాలతో వరద ప్రభావం పొంచి ఉన్న కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జగిత్యాల మండలంలోని మోతె, రూరల్ మండలంలోని కండ్లపల్లి చెరువుల మత్తడిలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ మోతె చెరువు మరమ్మతుల కోసం ప్రభుత్వానికి రూ. 3 కోట్ల ప్రతిపాదనలు పంపామని తెలిపారు. జిల్లాలో సాధారణం కంటే ఎక్కువ వర్షం పడడం వల్ల వరద ప్రభావం ఉందన్నారు. మోతె చెరువుకు సంబంధించి 149 టీఎం సీల తక్కువ సామర్థ్యం ఉందని ఇప్పటి వరకైతే ఎలాంటి ప్రమాదం లేదన్నారు. అనంతరం రూరల్ మండలంలోని కండ్లపల్లి చెరువును పరిశీలించి నీటిమట్టం, చెరువు స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మరో 3 రో జుల పాటు వర్షాలు ఉన్న నేపద్యంలో అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డీ వో మధుసూధన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



మోతె చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మృత్యువులోనూ వీడని బంధం

- గుండె పోటుతో రోజు వ్యవధిలో వదిన,మరదలు మృతి

కోరుట్ల, జూలై 23 : కోరుట్లలో ఒక్క రోజు వ్యవధిలో గుండెపోటుతో వదినె, మరదలు మృతి చెందిన ఘటన విషాదం మిగిల్చింది. కోరుట్ల పట్టణానికి చెందిన దువ్వ గంగుబాయి, తోట గంగుబాయి ఇద్దరూ వదినెమరదళ్లు. కోరుట్లలోని ప్రకాశం రోడ్డులో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. 20 రోజుల క్రితం దువ్వ గంగుబాయి (57) పూణేలో ఉన్న తన కూతురు వద్దకు వెళ్లింది. సోమవారం ఉదయం గంగుబాయి గుండె పోటుతో అక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని కోరుట్లలో ఉన్న తోట గంగుబాయి (56) కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఆమె మృతదేహాన్ని పూణే నుంచి కోరుట్లకు తీసుకురావడానికి సన్నద్ధం అయ్యారు. పూణేలో తన వది నె గంగుబాయి మృతి చెందిన విషయం తెలిసినప్పటి నుంచి కోరుట్లలో ఉన్న మరదలు తోట గంగుబాయి తీవ్ర మనోవేదనకు గురైంది. సోమవారం సాయంత్రం సమయంలో బాత్ రూంకు వెలుతుండగా తోట గంగుబాయి కింద పడిపోయి అపస్మారక స్థితికి వెళ్లింది. గమనించిన బంధువులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే గంగుబాయి గుండె పోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పూణే నుంచి దువ్వ గంగుబాయి మృతదేహం రాత్రి కోరుట్లకు చేరుకుంది మంగళవారం ఉదయం వదినే మరుదలు అంతక్రియలను బంధువులు నిర్వహించారు. గంటల వ్యవధిలో వదినే మరుదలు మృతి చెందడంతో కుటుం బంలో తీవ్ర విషాదం అలుముకుంది.



తోట గంగుబాయి..దువ్వ గంగుబాయి(ఫైల్)

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

జమ్మికుంట, జూలై 23: జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని హుండీ ధ్వంసం చేసిన దొంగలు 40 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

వస్త్ర పరిశ్రమ మనుగడకు చర్యలు తీసుకోవాలి

ప్రజా సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 23 : సిరిసిల్ల వస్త్ర పరిశ్ర మనుగడ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిరిసిల్లలో చేపట్టిన నిరాహారదీక్షకు మద్దతు తెలుపుతూ ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆరు నెలలుగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతో తొమ్మిది మంది కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. సంక్షోభ నివారణకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం మూలంగా వస్త్ర పరిశ్రమ నడవక కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కుటీర పరిశ్రమగా ఉన్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను బతుకమ్మ చీరల పేరుతో ఎస్ఎస్ఐ యూనిట్స్, మాక్స్ సంఘాలను పెట్టించిందని, మిగతా క్వాలిటీ గుడ్డను నడవకుండా పూర్తిగా లూమ్స్‌పై బతుకమ్మ చీరల మాత్రమే నడపాలని నిబంధన పెట్టి పాలిస్టర్, కాటన్ పరిశ్రమ మనుగడ లేకుండా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీని కొనసాగించాలని, యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్, నేతన్న బీమా, నేతన్న చేయుత, వర్క్ టూ ఓనర్ పథకాలను అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వం స్పందించక పోతే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు, సీపీఐ జిల్లా నాయకుడు మీసం లక్ష్మణ్, విద్యార్థి సంఘం నాయకుడు అంగూర్ రంజిత్, దళిత సంఘాల నాయకులు మంగళి చంద్రమౌళి, రాజశేఖర్, మురళి, బాలరాజు, చంద్ర పాల్గొన్నారు.

కల్వల ప్రాజెక్టుకు గండి



గండి పడి దిగువకు పోతున్న నీరు

శంకరపట్నం, జూలై 23: శంకరపట్నం మండంలోని కల్వల ప్రాజెక్టుకు మంగళవారం గండి పడి నీరు దిగువకు పోతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరింది. మత్తడి దగ్గర కట్ట బలహీనంగా ఉండడంతో గండి పడింది. దీంతో ప్రాజెక్టులోని నీరు వృథాగా దిగువకు పోతోంది. గత సంవత్సరం వర్షాకాలంలో ప్రాజెక్టుకు గండి పడడంతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. వేసవిలో పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేపట్టకపోవడంతో, తాత్కాలిక మరమ్మత్తులు చేసిన చోట కట్ట బలహీనపడి గండి పడింది. దీంతో కల్వల ప్రాజెక్టుపై ఆధారపడిన శంకరపట్నం, వీణవంక మండలాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

ప్రాజెక్టులోకి 25,490 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 25,490 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 23.122 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 52.948 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 532 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 16.944 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.155 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూలై 23: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూన్ 2024లో నిర్వహించిన బీఈడీ మోదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు శాతవాహన విశ్వ విద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. పరీక్ష ఫలితాలను శాతవాహన యూనివర్సిటీ వెబ్సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ యువకుడి మృతి

సుల్తానాబాద్, జూలై 23: సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి వద్ద రాజీవ్ రహదారిపై మంగళ వారం జరి గిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన గుండ్ల శ్రీనివాస్(27) ఉదయం బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరగా, సుల్తానాబాద్ మం డలం నర్సయ్య పల్లి వద్ద లారీ ఢీకొన్నది. ఈ ప్రమా దంలో అతను తీవ్రంగా గాయపడగా సుల్తానా బాద్ ఆస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా మృతిచెంది నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన లారీ డ్రైవర్ బండ శివ నాగేశ్వర్‌రావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



అతిసారం.. ప్రమాదకరం

● డయేరియాతో డీ హైడ్రేషన్ ● అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

అతిసారకు కారణాలు

బ్యాక్టీరియా, వైరల్ పరాన్న జీవుల వలన అతిసార వ్యాధి వస్తుంది. ఎక్కువగా మలం, కలుషిత నీటి వలన డయేరియా సోకుతుంది. తాగడానికి, వంట చేయడానికి సురక్షితమైన నీరు వాడక పోవడం, పారిశుధ్య లోపం వ్యాధికి ప్రధాన కారణం కావచ్చు. ఐదేళ్ల కంటే తక్కువ వయసు పిల్లల్లో వైరల్ వ్యాధి కారకాలు రోట వరస్, నోరో వైరస్, అడెనో వైరస్, బ్యాక్టీరియల్ వ్యాధి కారకాలలో ఎస్చెరియా కోలి, సాల్మోనెల్లా, షిగెల్లా ఉన్నాయి.

నివారణ చర్యలు

- సురక్షితమైన తాగు నీరు ఉపయోగించడం.
- వ్యక్తిగత, ఆహార పరిశుభ్రత పాటించడం.
- సబ్బుతో చేతులు కడుక్కోవడం.
- అంటు వ్యాధులపై అవగాహన కలిగి ఉండడం.
- రోటా వైరస్ టీకా వేసుకోవడం.
- పౌష్టికాహారం తీసుకోవడం.

వెల్గటూర్, జూలై 23: వర్షాకాలం వచ్చిందంటేనే వాతావరణ మార్పులతో పాటు సీజనల్ వ్యాధులు కూడా వ్యాపిస్తుంటాయి. బావులు, బోరు బావుల్లో కొత్త నీరు చేడంతో కలుషిత నీరు తాగడం వలన కూడా వ్యాధులు ప్రభలడానికి అవకాశం ఉంది. వర్షా కాలంలో ప్రభలే వ్యాధుల్లో అతిసార వ్యాధి ఒకటి. అతిసార వలన వాంతులు విరేచనాలు కలిగి శరీరం మొత్తం డీ హైడ్రేషన్ కావడంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. అతిసారం అతి ప్రమాదకరమైందని, దీని వలన ప్రాణాలకు ముప్పు వాటిల్లకూడదంటే అప్రమత్తత చాలా అవసరమని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత అత్యవసరమని పేర్కొంటున్నారు. అతిసార ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఎక్కువగా వస్తుంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించే అవగాహన లేకపోవడంతో చిన్నారులకు ఎక్కువగా సోకుతుంది. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లల్లో పోషకాహార లోపం కూడా అతిసారం ప్రధాన కారణమని వైద్యాధికారులు అంటున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెరగడం, మెరుగైన వైద్య చికిత్స విధానాలు అందుబాటులోకి రావడంతో జిల్లాలో కొన్నేళ్లుగా అతిసార మరణాలు సంభవించలేదు.

అవగాహన అవసరం

అతిసార (డయేరియా) వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలి. డయేరియా సోకకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం. కలుషిత ఆహారం, కలుషిత నీరు, పారిశుధ్య లోపం అతిసార వ్యాధికి ప్రధాన కారణ మని చెప్పవచ్చు. సెప్టిక్ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు కూడా డయేరియాకు కారణం కావచ్చు. అతిసార వ్యాధి సోకిన వారికి సుమారు పక్షం రోజుల పాటు వాంతులు, విరేచనాలు ఉంటాయి. దీనితో శరీరంలో నీరు, లవణాలు కోల్పోయి ప్రాణాలకు ముప్పు కలుగవచ్చు. పోషకాహార లోపం, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు, గుండె, కిడ్నీ, షుగర్ సంబంధిత వ్యాధులు ఉన్న వారు అతిసార వ్యాధి బారిన పడే అవకాశం అధికంగా ఉంది.

డీ హైడ్రేషన్‌తో ప్రాణాలకు ముప్పు

డయేరియా సోకిన వారికి వాంతులు, విరేచనాలు కొన్ని రోజులు పాటు కొనసాగడంతో శరీరం డ్రై హైడ్రేషన్ కారణంగా ప్రాణాలకు ముప్పు వాటిల్లవచ్చు. తీవ్రమైన డీ హైడ్రేషన్ కారణంగా అపస్మారక స్థితికి వెళ్లే అవకాశం కూడా ఉంటుంది. విరేచనాలు కావడం వలన శరీరంలో నీటితో పాటు సోడియం, పొటాషియం, క్లోరైడ్ బై కార్బొనేట్ వంటి ఎలక్ట్రోలైట్లు కోల్పోతాయి. ద్రవ మలం, వాంతులు, మూత్రం, చెమట ద్వారా శరీరం నీటిని కోల్పోతుంది. నిరంతర విరేచనాలు, మలంలో రక్తం కనిపించినపుడు లేదా డీ హైడ్రేషన్ సాంకేతాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం ఉత్తమం.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



అతిసార వ్యాధితో పాటు సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండాలంటే వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలి. బయటి ప్రదేశాలకు వెళ్లి వచ్చినపుడు, మల, మూత్రాలు విసర్జించినపుడు చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలి. బయటి పదార్థాలు తినకూడదు. వాంతులు, విరేచనాలు అయినపుడు వైద్యులను సంప్రదించాలి. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. కొన్నేళ్లుగా జిల్లాలో డయేరియా మరణాలు లేవు. కోటి లింగాలలో డయేరియాతో మృతి చెందిన కేసు ఇటీవలే నమోదైంది.



కోటిలింగాలలో పరిసరాలు పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

బెల్ట్‌షాపు నిర్వాహకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జూలై 23: సుల్తానాబాద్ మండలంలోని మియాపూర్ గ్రామానికి చెందిన కేశ సంతోష్ సోమవారం రాత్రి ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. రెండేళ్లుగా గ్రామంలో సంతోష్ బెల్టుషాపు నిర్వహిస్తుండగా, పది రోజుల క్రితం నుంచి మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పెంచి అమ్ముతున్నారని, దాంతో తన వద్ద ఎవరూ అంత ధర పెట్టి మద్యం కొనుగోలు చేయడం లేదని, వ్యాపారులు ధరలు తగ్గించాలని తన స్టేటస్ లో పెట్టుకున్నాడు. దీంతో మద్యం సిండి కేట్ నిర్వాహ కులు తనకు ఫోన్ చేసి బెదరించారని సంతోష్ తన సెల్ఫీ వీడియోలో ఆరోపించాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా, సిండికేట్ గురించి అబ్కారీ సీఐ రఘునాథ్‌ను అడుగగా అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో ఆస్తినష్టం

పెద్దపల్లి రూరల్, జూలై 23 : పెద్దపల్లి మండలంలోని కనగర్తికి చెందిన ఏడెల్లి పద్మకు చెందిన ఇంటిలో విద్యుదాఘాతంతో ప్రమాదం చోటుకుంది. ఫైర్ ఆఫీసర్ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏడెల్లి పద్మ వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా, ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 4లక్షల 50 వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితురాలు పేర్కొంది.

రైల్వే స్టేషన్లో ఒకరి మృతి

జమ్మికుంట, జూలై 23: జమ్మికుంట రైల్వే స్టేషన్ లోని టికెట్ బుకింగ్ కౌంటర్ హాల్‌లో నిద్రించిన ఓ వ్యక్తి మృతి చెందాడు. బీహార్ రాష్ట్ర నలంద జిల్లా పినిపర్‌కు చెందిన దినేష్ యాదవ్ (46) పట్టణంలోని ఓ రైస్ మిల్లులో కొంత కాలంగా పని చేస్తున్నాడు. మంగళ వారం స్వగ్రామం వెళ్లేందుకు రైల్వే స్టేషన్ చేరుకున్నాడు. టికెట్ బుకింగ్ కౌంటర్ హాల్‌లో నిద్రించాడు. చుట్టు పక్కల వారు లేపినా లేవకపోయే సరికి అధికారులకు తెలిపారు. వారు డాక్టర్‌ను పిలిచి పరీక్షించగా మృతి చెందాడని నిర్ధారించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంట ఉత్పత్తులకు మద్దతు ధరకు

చట్టబద్ధత కల్పించకపోవడం బాధాకరం

- దేశ వ్యాప్తంగా రైతు రుణ మాఫీని బడ్జెట్‌లో విస్మరించారు
- ఆర్మూర్ - ఆదిలాబాద్ రైల్వే లైన్ ఊసే లేదు

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో పంట ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత కల్పించకపోవడం బాధాకరమని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తమకు వరాలు ప్రకటిస్తారని అన్నదాతలు ఆశించినప్పటికీ నిరాశకు గురిచేశారన్నారు. రైతాంగాన్ని రుణ విముక్తులను చేయడానికి జాతీయ స్థాయిలో ప్రయత్నాలు బడ్జెట్‌లో చేయలేదని విమర్శించారు. అంబానీ, ఆదానీ లాంటి వారికి రూ. లక్షల కోట్లు రాయితీ కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించడం విచారకరమన్నారు. తీవ్ర అప్పుల్లో కూరుకపోయిన రైతాంగాన్ని రుణ విముక్తులను చేయడానికి కేంద్రం రుణమాఫీ కార్యక్రమం ప్రారంభించాల్సిన అవసరముందన్నారు.



గతంలో 2008 సంవత్సరంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా రూ. లక్ష రైతు రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 15 సంవత్సరాల కాలంలో ఏ ప్రభుత్వం కూడా రుణమాఫీపై ఆలోచన చేయలేదని విమర్శించారు. ఆర్మూర్ - ఆదిలాబాద్ రైల్వే లైన్ నిర్మాణ వ్యవహారాన్ని బడ్జెట్‌లో విస్మరించారన్నారు. ఈ రైల్వే లైన్ నిర్మాణం వల్ల దక్షిణ భారతదేశం, ఉత్తర భారతదేశాన్ని కలిపే విధంగా సికింద్రాబాద్ - ఢిల్లీ లైన్ సుమారు వంద కిలో మీటర్ల దూరం తగ్గుతుందని, సుమారు రెండు గంటల సమయం ఆదా అయ్యే అవకాశాలున్నాయన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అంశం రైల్వే లైన్ కాదని, ఇంతటి ప్రాధాన్యత ఉన్న రైల్వే లైన్‌పై తెలంగాణ రాష్ట్రం పట్ల వివక్షత కాదా అని, దక్షిణ భారత దేశాన్ని బడ్జెట్‌లో విస్మరించారని విమర్శించారు. ఆంధ్రాకు సంబంధించిన అంశాలకు సుమారు రూ. 15 వేల కోట్లను బడ్జెట్‌లో మంజూరు చేశారన్నారు. గతంలో యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన తెలంగాణలో ఐటీఐఆర్ ప్రాజెక్టు పునరుద్ధరణకు బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తారని ఆశించామని ఎటువంటి ప్రస్తావన బడ్జెట్‌లో చేయలేదన్నారు. మూసి రివర్ ఫ్రంట్‌కు సంబంధించి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారని భావించామని కేంద్రం బడ్జెట్‌లో విస్మరించిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పాత్ర పోషించినప్పటికీ తెలంగాణలో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సత్సంబంధాలు కొనసాగిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన స్పందన కనబడడం లేదని తెలిపారు.

స్థానిక సంస్థలు

ఆదాయాన్ని పెంపొందించుకోవాలి

● అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి ● రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

● ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

కరీంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో ఆదాయాన్ని మరింత పెంపొందించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య పేర్కొన్నారు. మంగళవారం కరీం నగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులతో స్థానిక సంస్థల విధులు-బాధ్యతలపై రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అధికారుల నుంచి విధులు, బాధ్యతలు, ఆదాయం పెంచే మార్గాలపై సూచనలు సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులపైనే ఆధారపడకుండా సానికల సంస్థలు మరింత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. స్థానిక సంస్థల ఆర్థికంగా బలోపేతమైతేనే రాష్ట్రం, దేశం పటిష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాకు అన్ని అంశాలపై అవగాహన ఉన్న కలెక్టర్ పమేలా సత్పతి దొరకడం జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. అధికారుల సూచనల మేరకు జిల్లా కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్న నమ్మకం ఉందని తెలిపారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి చర్యలు

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

గ్రామాలు, పట్టణాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభిప్రాయపడ్డారు. మహిళా సంఘాల అభివృద్ధితోనే స్థానిక సంస్థలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. స్వశక్తి మహిళా సంఘాలు అప్పగించిన పనులను దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు, స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ పనులు అద్భుతంగా పూర్తి చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళలను కోటీశ్వరులు చేసే కార్యక్రమంలో భాగంగా ముందుకెళ్తున్నామని వివరించారు. అన్ని అంశాలను చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఏం రమేష్, సంకెపెల్లి సుధీర్‌రెడ్డి, మాలోతు నెహ్రూనాయక్, రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ జిందం చంద్రకళ, రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు, పెద్దపెల్లి అదనపు కలెక్టర్ అరుణశ్రీ, కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీపీఓ రవీందర్, జెడ్పీ సీఈవో లు శ్రీనివాస్, గౌతమ్‌రెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని డీఆర్డీవోలు, సీఈవోలు డీపీఓలు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్రయోగాలు చేయాలి

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సెక్రెటరీ స్మితా సబర్వాల్

గ్రామాలు, పట్టణాల్లో ఆదాయం పెంచే మార్గాలపై అధికారులు కొత్త కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సెక్రెటరీ స్మితా సబర్వాల్ సూచించారు. స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు ఫైనాన్స్ కమిషన్ కీలకపాత్ర పోషిస్తుందని, ఇది తమ బాధ్యత అని పేర్కొన్నారు. కరీంనగర్ గడ్డ తనకెంతో ఇష్టమని తెలిపారు. మున్సిపాలిటీల్లో అనవసర ఖర్చులు తగ్గించుకుంటూ, ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు.



రాజయ్యకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

వసతిగృహాల్లో అవినీతి, అక్రమాలపై

విచారణ జరిపించాలి

● రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి కెసిపేద్ది శ్రీధర్‌రాజు

గణేశ్‌నగర్,జూలై 23: జిల్లా బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యుత్ బిల్లుల పేరిట లక్షలాది రూపాయల అవినీతి అక్రమాలపై విచారణ జరి పించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయదేవికి మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ సం ఘం ప్రధాన కార్యదర్శి కెసిపేద్ది శ్రీధర్‌రాజు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మానకొండూర్ బీసీ సమీకృత వసతి గృహంలో దాదాపు 40 లక్షల పైగా విద్యుత్ బిల్లుల పేరిట అధి కారులు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. బాధ్యులందరిపై చర్యలు తీసుకోలేదన్నారు. 2018 నుంచి 2022 వరకు విద్యుత్ బిల్లులకు కేటాయించిన నిధులపై దాని వినియోగంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖకు పూర్తి స్థాయి అధికారులు లేకపోవడం వల్ల కార్యాలయంలో పని చేసే అడ్మినిస్ట్రేషన్ అధికారి తన ఇష్టారాజ్యంగా వ్యవహరించి తనకు అనుకూలంగా ఉన్న వారికి ఎక్కువ నిధులు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకొని బీసీ సంక్షేమ శాఖను కాపాడాలని అన్నారు.



వినతి పత్రం చూపుతున్న కెసిపేద్ది శ్రీధర్‌రాజు

ఇద్దరు చెయిన్ స్నాచర్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, జూలై 23: ఒక యువకుడి మెడలోని బంగారు చెయిన్‌ను దొంగలించిన ఇద్దరు చెయిన్ స్నాచర్లను అరెస్టు చేశామని కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. ఏసీపీ వివరాల ప్రకారం....

కట్టరాంపూర్‌కు చెందిన సమంత్ కోతిరాంపూర్‌లో జరుగుతున్న బోనాలలో పాల్గొని ఈ నెల 17న ఉదయం 4 గంటలకు బైక్‌పై ఒంటరిగా ఇంటికి వస్తుండగా తిరుమల్ నగర్ రోడ్ నంబరు 6 వద్ద ఇద్దరు ద్విచక్రవాహనంపై వచ్చి సమంత్ మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు తెంపుకుని పారిపోయారు. బాధితుడు వెంటనే కరీంనగర్ ఒకటో థాణా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేప ట్టిన పోలీసులు మం గళవారం ఉజ్వల పార్క్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా బంగారు గొలుసు లభ్యమైంది. విచారించగా చెయిన్ స్నాచింగ్ చేసిన నేరం ఒప్పుకున్నారు.

నిందితులు హైదరాబాద్‌కు చెందిన బీటెక్ విద్యార్థి ఎండీ ఫైజాన్(22), మానకొండూర్‌కు చెందిన షేక్ సాహిద్ (22)లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి బంగారు గొలుసు, ద్విచక్రవాహనం స్వాధీ నం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కమాన్‌పూర్, జూలై 23 : మండలంలోని గొరెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ధనపునేని అనిల్(30) వృతిరీత్యా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ నెల 22న సాయం త్రం 4 గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగి పడిపోగా గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ధనపునేని నర సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వస్త్ర పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

మాజీ ఎమ్మెల్సీ చెరుపెల్లి సీతారాములు



సిరిసిల్లలో దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సీతారాములు

సిరిసిల్ల రూరల్, జూలై 23 : సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు మంగళవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీతారాములుతోపాటు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూర పాటి రమేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూఉపాధిలేక మరమగ్గాల కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో అత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందని మండిపడ్డారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తొమ్మిది నెలలనుంచి సంక్షోభంలో కూరుకపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను మానుకోవాలన్నారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు సంబంధించి కరెంట్ సమస్య పెను శాపంగా మారిందన్నారు. పది హెచ్‌పీల వరకు ఉచిత కరెంట్ ఇచ్చి ఆ తర్వాత వాటికి నాలుగో కేటగిరి కింద 50 శాతం సబ్సిడీ కొనసాగించాలన్నారు. బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్‌లు ఇవ్వాలన్నారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని అందించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షో భానికి బాధ్యత వహించాలన్నారు. వస్త్ర పరిశ్రమపై జీఎస్టీని రద్దు చేయాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ సిరిసిల్ల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. సిరిసిల్ల నేతన్నలకు ఉపాధిని కల్పించే విధంగా కేంద్రం నుంచి ఆర్డర్‌లను తీసుకురావాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల సంక్షోభంపై మాట్లాడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతన్న సమస్యలకు పరిష్కారానికి కృషి చేయాలని, వారి బతుకులతో రాజకీయం చేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఈ నెల 26లోగా సమస్యలను పరిష్కరించకుంటే ఇంటికో వ్యక్తి చలో హైదరాబాద్ తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు యెల్దెండి దేవాదాస్, గాజుల నారాయణ, ఏనుగుల ఎల్లయ్య, సిరిసిల్ల రవీందర్, ఎక్కలదేవి జగదీష్, శ్రీగాద మైసయ్య, చేరాల అశోక్, కోడం అశోక్, బండారి అశోక్, మ్యాన సత్యనారాయణ దీక్షలో కూర్చున్నారు. మూషం రమేష్, పంతం రవి, దామోదర్, మండల సత్యం, మోర రాజు, అడెపు భాస్కర్, కుమ్మరికుంట కిషన్, గోనె పర్శరాములు పాల్గొన్నారు.

వర్షంలో భోజనాలు చేస్తూ రాస్తారోకో

రిలే నిరాహార దీక్షల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా జేఏసీ ఆధ్వర్యంలో యజమానులు, ఆసాములు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు భోజనాలు చేస్తూ రాస్తారో చేపట్టారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ సైతం నిరసన తెలిపారు. ట్రాఫిక్ స్తంభించిపోవడంతో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వారితో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, జూలై 23: వినియోగ దారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా కరీంనగర్ సర్కిల్ పరిధిలో 189 కెపాసిటర్ బ్యాంకులు పెట్టినట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. ఇంకా 12 కెపాసిటర్ బ్యాంకులు పెట్టనున్నట్లు తెలిపారు. వోల్టేజ్‌లో హెచ్చుతగ్గులు లేకుండా కెపాసిటర్ బ్యాంకులు ఉపయోగపడుతాయని అన్నారు. కెపాసిటర్ బ్యాంకులతో సబ్‌స్టేషన్, లైన్లలో విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ కాకుండా నియంత్రిస్తున్నదన్నారు. సబ్ స్టేషన్‌లలో, అలాగే 11కెవి లైన్లలో కెపాసిటర్లు అమర్చడం వలన పవర్‌ఫాక్టర్ మెరుగుపడుతుందన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు, పారిశ్రామిక ఫీడర్లకు లోవోల్టేజ్ వలన మోటార్లు కాలిపోకుండా ఉండేందుకు కెపాసిటర్ బ్యాంకులు దోహద పడుతాయన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థలో పవర్ ఫ్యాక్టర్ ఘననీయంగా మెరుగు పరచడానికి కెపాసిటర్ బ్యాంకులు దోహద పడుతున్నాయన్నారు. టెక్నికల్ నష్టాలు ఘననీయంగా తగ్గుతాయన్నారు. పరికరాల మన్నిక చాలాకాలం పెరుగుతుందన్నారు. పారిశ్రా మిక వినియోగదారులకు కెపాసిటర్లు పెట్టు కోవడానికి ప్రోత్సహిస్తున్నామన్నారు. వీటి వలన ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం తగ్గి మోటార్లు కాలిపోకుండా మన్నిక పెరుగుతుందని తెలిపారు.



దేవాలయ భూముల సర్వే

కోరుట్ల, జూలై 23 : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయానికి సంబంధించిన భూములను మంగళవారం దేవాలయ శాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. రెండు రోజుల క్రితం కలెక్టర్‌కు ప్రజావాణి కార్యక్రమంతో పాటు స్థానిక తహసిల్దార్‌కు భూములను పరిరక్షణ చేయాలని కోరుతూ మున్సిపల్ బీజేపీ కౌన్సిలర్ పెండం గణేష్ వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన కలెక్టర్ భూములను సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశాలను జారీ చేసారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎండోమెంట్ జోనల్ సర్వేయర్ అనిల్, మండల సర్వేయర్ అనిల్, వేంకటేశ్వర స్వామి దేవాలయ ఈవో విక్రం, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, ఆర్ఐ రాజేందర్ రావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

రాయికల్, జూలై 23: రాయికల్ పట్టణంలో పలు అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఆర్థిక సంఘానికి మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు మంగళవారం రాష్ట్ర ఆర్థిక సంఘం సమావేశంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయికల్ మున్సిపాలిటీకి రూ.1.20 కోట్లు సంవత్సర ఆదాయం పన్నుల వసూలు రూపంలో వస్తుందని, వేరే ఇతర ఆదాయ మార్గాలు లేవన్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా ప్రతి నెల పారిశుధ్య నిర్వహణకు, పలు ముఖ్యమైన అభివృద్ధి పనులు చేప ట్టడానికి నిధులు విడుదలయ్యేవని, ఈ నిధుల ద్వారా పట్టణంలో పారిశుధ్య నిర్వహణ జరిగేదన్నారు. ఏడాదిగా పట్టణ ప్రగతి నిధుల మంజూరీ లేక పారి శుధ్య నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.

మృతదేహంతో ఆందోళన

మల్యాల, జూలై 23: కత్తిపోట్లకు గురైయిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందగా కుటుంబసభ్యులు మృతదేహంతో ఆందోళన చేసిన సంఘటన మండలంలోని మ్యాడంపల్లిలో జరిగింది. మ్యాడంపల్లికి చెందిన గుర్రం చిన్న మల్లయ్య కొడుకు రాజ్‌కుమార్ ఇదే గ్రామానికి చెందిన ఓ యువతి కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 14న రాత్రి రాజ్‌కుమార్ ఇంటికి యువతి తండ్రి గంగాధర్ అతని తమ్ముడు అంజి వెళ్లగా ఇంట్లో రాజ్‌కుమార్ లేకపోవడంతో అతని తండ్రి గుర్రం చిన్నమల్లయ్యను కత్తితో పొడిచి గాయపరిచారు. చిన్నమల్లయ్య తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు దాడి చేసిన గంగాధర్ ఇంట్లోనే దహనం చేస్తామని ఆందోళన చేశారు. బాధ్యులపై రౌడీ షీట్ ఓపెన్ చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని మృతదేహంతో ఆందోళన చేశారు. ఎస్సై నరేష్‌కుమార్ అక్కడకు చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడారు. ఇప్పటికే అరెస్టు చేశామని తగు న్యాయం చేస్తామని తెలుపడంతో శాంతించిన కుటుంబసభ్యులు, గ్రామస్తులు అంత్యక్రియలు పూర్తి చేశారు. గత గురువారం అంజి, గంగాధర్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు

మెట్‌పల్లి, జూలై, 23 : పట్టణంలోని బంగారు పెద్దమ్మ ఆలయంలో కాత్యాయనీ దేవి వ్రతాన్ని నిర్వహకులు ఘనంగా జరిపించారు. మంగళవారం ఆలయంలో ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలు తదితర కార్యక్రమాలను జరిపారు. ఉత్సవ మూర్తులతో భక్తులు పెద్దమ్మ ఆలయం చుట్టు ప్రదక్షనలు చేసి ఆయలంలో ఏర్పాటు చేశారు. అనంతరం స్వామికి పుష్పార్చనలతో అభిషేకాలు, పూజలు జరిపించారు. అనంతరం భక్త లు ఆలయం సమీపంలోని శ్రీ ఐశ్వర్యలక్ష్మి గోశాలలోని గోమాలతలకు మహి ళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు.

కోటిలింగాలను సందర్శించిన జడ్పీ డిప్యూటీ సీఈవో

వెల్గటూర్, జూలై 23: మండలం లోని ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాలను జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్ మంగళవారం సందర్శించారు. శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోదావరి ప్రాంతాన్ని పరిశీలించారు. వరదల కారణంగా రోజుకు రోజుకు పెరుగుతున్న గోదావరి పరిస్థితిని పరిశీలిస్తూ ప్రజలకు తగు సూచనలు, హెచ్చరికలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేఖర్, ఆర్ఐ రాజేశ్వరి పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

గొల్లపల్లి, జూలై 23 : మొక్కలు మనకు ప్రాణవాయువును అందిస్తాయని ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవాకం ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గొల్లపల్లి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కొంతం నగేష్, ఉపాధ్యాయులు రవి కుమార్, రాకేష్, ప్రవీణ్ కుమార్, పూర్ణచంధర్, అభిషేక్, రవీంధర్, రజిత, పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

జగిత్యాల టౌన్, జూలై 23 :జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. 44 మంది నిరుపేదలకు నేత్ర వైద్యుల ఆధ్వర్యంలో చికిత్సలు నిర్వహించి కంటి అద్దాలతో పాటు మందులు అంద జేశారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తాటిపాముల వినోద్‌కుమార్, ప్రధాన కార్య దర్శి శంకర్, కోశాధికారి గంగాధర్ ఉన్నారు.

కూలిందా..గోవిందా

ఎంఈవో కార్యాలయానికి పొంచి ఉన్న ప్రమాదం



ఎంఈవో కార్యాలయం పై ప్రమాదకరంగా ఉన్న వృక్షం

సారంగాపూర్, జూలై, 23 : సారంగాపూర్ మండల కేంద్రంలో ఉన్న ఎంఈవో కార్యాలయానికి చెట్టు రూపంలో పెద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ కార్యాలయానికి పక్కనే పెద్ద వృక్షం ఉంది. ఈ వృక్షం కొమ్మలు కార్యాలయం పైకి వ్యాపించి ఉన్నాయి. వృక్షం సైతం ఒక వైపు వంగి కార్యాలయం పైన కూలేం దుకు సిద్ధంగా ఉంది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తుండగా ఏ క్షణంలోనైన ఈ చెట్టు కార్యాలయంపై కూలే ప్రమాదం ఉంది. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కార్యాలయానికి వచ్చే వారు కోరుతున్నారు.

రహదారిపై ప్రమాదకరంగా గుంత



రహదారిపై ఏర్పడిన గుంత

ఎండపల్లి, జులై 23: మండలంలోని రాజారాంపల్లి ప్రధాన చౌరస్తాలో గల గుంత ప్రమాదకరంగా మారింది. మూల మలుపుపై గుంత ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. నిత్యం ఈ దారి వెంట జగిత్యాల, నిజామాబాద్‌కి వందల వాహనాలు వస్తూ పోతూ ఉంటాయి. భారీ వాహనాలు కూడా ఇదే దారి వెంబడి వస్తాయి. వాహనాలు వేగంగా వస్తే అదుపు తప్పి కింద పడే అవకాశాలు ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాలు నడుస్తున్న ఈ రహదారిపై ప్రమాదకరంగా గుంత ఏర్పడినా ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డెంగ్యూ నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ సమియొద్దీన్

ధర్మపురి, జూలై 23: డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సమియొద్దీన్ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారిని మంగళవారం ఆయన కలిసి తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు సూచించారు. వ్యాధి చికిత్స నిర్ధారణ కోసం ప్రభుత్వ ఆసుప త్రికి వెళ్లాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఎడిస్ ఈజిప్టి అనే దోమ కుట్టినపుడు వస్తుందన్నారు. ఈ దోమ ప గటి పూట కుడుతుందని, హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, విపరీ తమై న తల నొప్పి, వికారం, వాంతులు, కీళ్లు, కండరాల నొప్పుల ఉంటాయని వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ చెత్తను ము రికి కాలువలో వేయరాదని, దోమలు పుట్టకుండా, పుట్టినచో కుట్టకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణకు వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండే దోమ లు గుర్తించి వాటిని తొలగించాలన్నారు. అంతకు ముందు ఆయన ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శ్రీనివాస్, హెచ్‌ఈవో సతీష్‌కుమార్, ఎంపీహెచ్ఎస్ వెంకటేష్, మురళి, హెల్త్ అసిస్టెంట్‌లు మహేందర్, భూమాలాల్, శోభన్‌బాబు, ఏఎన్ఎంలు సత్యగంగ, సుజాత, బ్రీడింగ్ చెకర్‌లు రవి, జయకర్, ఆశావర్కర్స్ పరిమళ, శిరీష, పోచమ్మ పాల్గొన్నారు.



తిమ్మాపూర్ గ్రామంలో పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో



కోటిలింగాలలో మాట్లాడుతన్న జిల్లా వైద్యాధికారి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెల్గటూర్, జూలై 23: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సమియొద్దీన్ సూచించారు. మంగళవారం వెల్గటూర్‌లో డెంగ్యూ పాజిటివ్ కేసుతో పాటు, కోటిలింగాలలో డయేరియా కేసు గృహాలను సందర్శించారు.

బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. కోటిలింగాలలో ఒకే కుటుంబంలో భార్య, భర్తలతో పాటు వారి కుమారుడు మొత్తం ముగ్గురు డయేరియాతో బాధపడడం, ఆ కుటుంబ పెద్ద డయేరియాతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యాధికారి ఆ కుటుంబంతో మాట్లాడి పరిసరాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని అనన్య అనే బాలికకు డెంగ్యూ పాజిటివ్ రావడంతో ఆ ఇంటితో పాటు చుట్టు పక్కల ఇళ్లలో దోమల నివారణకు పెరిత్రిమ్ పిచికారి చేశారు. ప్రజలు ప్రతీ ఒక్కరు తమ బాధ్యతగా ఇంటి పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా చేడాలని, దోమలు పెరుగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి లవకుమార్, ఎంపీవో శ్రీనివాస్, సీహెచ్‌వో జగన్నాథం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధరణి రద్దు చేసి భూ సమస్యలు పరిష్కరించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి భార్గవ్‌రామ్

పెగడపల్లి, జులై 23 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి వెబ్సైట్‌ను రద్దు చేసి భూసమస్యలు పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరుగంటి భార్గవ్‌రామ్ డిమాండ్ చేశారు. మంగళవారం పెగడపల్లి మండల కేంద్రంలో ఆ సంఘం నాయకులతో కలసి భార్గవ్‌రామ్ విలేఖరులతో మాట్లాడుతూ ధరణిని బొంద పెట్టి పిండం పెట్టాలని అప్పుడే భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత భూసమస్యలకు కారకుడయ్యాడంటూ , వీఆర్‌ఓలతో పరిష్కారమయ్యే సమస్యను కలెక్టర్లకు అప్పగించి రైతులను గోస పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా నాయకుల కోసం కొత్తగా రెవెన్యూ చట్టాలు తెస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తు న్నారని, ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికైనా ధరణిని రద్దు చేసి భూసమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని లేని యెడల బీసీ సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేయనున్నట్లు భార్గవ్‌రామ్ పేర్కొన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు తిరుపతి, రాజయ్య, కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి : 'ధరణి' అనే పోర్టల్‌ను తక్షణమే రద్దు చేసి 'భూమాత'ను వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవ రామ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం గొల్లపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూసమస్యల పరిష్కారం కోసమంటూ 'ధరణి' అనే పోర్టల్‌ను అమలు చేసి బహుజన వర్గాల రైతుల భూసమస్యలను మరింత పెంచేసి రైతుల ఉసురు తీసుకున్నారని విమర్శించారు. ధరణి అనే పోర్టల్ వచ్చిన నాటి నుంచి పేద, బడుగు, బలహీన వర్గాల భూయజమానులకు మరిన్ని ఇక్కట్లు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం నూతనంగా అమలు చేయనున్న భూమాత అనే పోర్టల్‌ను వెంటనే అమలు చేసి భూసమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.



విలేఖరులతో మాట్లాడుతున్న భార్గవ్‌రామ్

వేతన జీవులకు నిరాశ మిగిల్చిన బడ్జెట్

ధర్మపురి, జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్ వేతన జీవులకు నిరాశ మిగిల్చిందని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గజభీంకార్ గోవర్ధన్ అన్నారు. వేతన జీవులకు నూతన బడ్జెట్‌లో కొంత ఊరట ఇచ్చినట్లుగా చూపినప్పటికి పొదుపు చేసుకునే మార్గాలను పన్ను రూపంలో మరొక సారి కేంద్ర ప్రభుత్వం భారం పెంచి పొదుపు మంత్రాన్ని విస్మరించిందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యక్ష పన్నులు కొత్త రెస్యూమ్ నందు స్వల్ప ఊరటను ఇస్తూ స్టాండర్డ్ డిడక్షన్ 75 వేలకు పెంచడం మినహా 80 సీ మినహాయింపులు లేకపోవడం, హౌసింగ్ లోన్ కూడా నూతన రెస్యూమ్‌లో చూపకపోవడం ఉద్యోగులకు నిరాశ మిగిల్చిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం వేతన జీవుల ఆర్థిక పురోభివృద్ధికి బాటలు వేయడానికి పన్ను భారాన్ని తగ్గించాలని కోరారు.

తెలంగాణకు మొండిచెయ్యి

కథలాపూర్, జూలై 23 : కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచెయ్యి చూపిందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆరోపించారు. కథలాపూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించి తెలంగాణపై వివక్ష కనబరిచారని అన్నారు. పార్లమెం ట్‌లో ఉన్న తెలంగాణ ఎంపీలు కనీసం ఒక్క మాటైనా మాట్లాడకపోవడం సిగ్గుచేటని చెప్పారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెరో ఎనిమిది పార్లమెంట్ సీట్లు గెలిపిస్తే ఇదేనా జరిగిన న్యాయం అని విమర్శించారు. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పారు. ప్రజలు రాబోవు ఎన్నికల్లో గుణపాఠం చెప్పక తప్పదని అన్నారు.

గొర్రెల అపహరణ

ఎండపల్లి, జూలై 23: గ్రామాలలో దొంగల బెడద రోజు రోజుకు పెరిగిపోతోంది. మండలంలోని మారేడుపల్లి గ్రామంలో సోమవారం రాత్రి అల్లంల వినోద్‌కి చెందిన ఐదు గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వినోద్ గొర్రెలను కాసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం ఉదయం చూసే సరికి ఐదు గొర్రెలు కనిపించలేదు. వాటి విలువ సుమారుగా 70 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సంక్షిప్త సమాచారం

జగిత్యాల: రాష్ట్ర శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబును మంగళవారం మాజీ మంత్రి రాజేశం గౌడ్ కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వానికి మాజీ శాసన సభ్యుల సంఘం తరఫున శుభాకాంక్షలు తెలిపారు.

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలోని కోరిన కొరికలు తీర్చే మహాలక్ష్మీ అమ్మ వారి బోనాల జాతరకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ పారిశుధ్య సిబ్బందితో ఆలయం పరిసరాలను శుభ్రం చేయించారు.

●మెట్‌పల్లి కోర్టుకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన న్యాయవాదులను బార్ అసోయేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. నూతంగా ఏపీపీగా బాధ్యతలు స్వీకరించిన గాదారి ప్రణయ్, ఏజీపీ అబ్దుల్ హఫీజ్‌లను బార్ అసోయేషిన్ సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి ఆధ్వర్యంలో నాయకులు శాలువలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని 4వ వార్డులో వన మహోత్సవంలో భాగంగా వార్డు కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. మేనేజర్ వెంకట్, వార్డు ఆఫీసర్ పోచయ్య, ప్రత్యూష, హరీష్, ఆర్పీ రిజ్వానా పాల్గొన్నారు.

●మండలంలోని భూపతిపూర్ గ్రామంలో ప్లాస్టిక్ సేకరించి విక్రయించడం ద్వారా రూ.1500 ఆదాయం సమకూరినట్లు పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ తెలిపారు.

బీర్‌పూర్: మండలంలోని సిరిపురం రైతు వేదికలో మంగళవారం పత్తి రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. పంటలో తెగుళ్లు, చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, పశు సంవర్ధక శాఖ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.

కోరుట్ల రూరల్: పట్టణ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా కచ్చ రమేష్‌ను నియమిస్తున్నట్లు ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు గంద్ర వేంకటేష్ మంగళవారం ప్రకటించారు. కచ్చ రమేష్ మాట్లాడాతూ తన నియమాకం సహాకారం అందించిన బీజేపీ, బీజేవైఎం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొడిమ్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం నిర్వహించ తలపెట్టిన రైతు నేస్తం కార్యక్రమం మంగళవారం మండలంలోని పూడూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు నిర్వహించారు. వానా కాలంలో పత్తిపంటల సాగు విధానం, చీడ పీడల నివారణ, ఎరువుల యాజమాన్యం, వరి పంటలో మెళుకువలు తదితర అంశాలపై రైతులకు కలిగిన పలు సందేహాలను ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఏవో జ్యోతి, పలువురు ఏఈ వోలు, రైతులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామంలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎంపీటీసీ, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి, బీజేపీ గ్రామ సీనియర్ నాయకులు వడుకాపురం గంగస్వామి, నవీన్, రాహుల్, ఎనుగంటి రాజు, కంటె భూమేష్ పాల్గొన్నారు.

రైతు బీమా నమోదు చేసుకోవాలి

మల్యాల, జూలై 23: గత నెల జూన్ 30వరకు పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు రైతుబీమా కోసం నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె. చంద్రదీపక్ కోరారు. 18నుంచి 59 ఏళ్ల కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తులను ఏఈవోలకు అందించాలని అన్నారు. అలాగే రైతుబీమా కలిగిఉన్న రైతులు తమ నామిని వివరాలు మార్పులు, చేర్పులకు ఈ నెల 30 వరకు అవకాశం ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు మండల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతుల నుంచి రైతుబీమా దరఖా స్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు ఏఈవోలు మంజుల, కారుణ్యకుమార్, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు

అంజన్న ఇంజనీరింగ్ అధికారికి సన్మానం

మల్యాల, జూలై 23: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో 13 ఏళ్లుగా విధులు నిర్వహిస్తూ వేముల వాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంకు బదిలీపై వెలుతున్న అసిస్టెంట్ ఇంజనీర్ ఆర్.లక్ష్మన్‌రావును మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం దేవస్థానం ఉద్యోగులు, అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించారు. దేవస్థానం పరిధిలో ఏఈ అందించిన సేవలను కొనియాడారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ఉప ప్రధానర్చకులు చిరంజీవస్వామి పాల్గొన్నారు

రహదారికి మరమ్మతులు

కొడిమ్యాల, జూలై 23 : మండలంలోని సంద్రల్లపల్లి బ్రిడ్జ్ వద్ద ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు మట్టి కొట్టుకు పోవటంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం సూచనలతో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ టి. రాజమణి మొరం పోయించారు. తహసీల్దార్ వెంట ఆర్.ఐ కరుణాకర్, తిర్మాలాపూర్ గ్రామ నాయకుడు మల్లేశంయాదవ్, నాయకులు సత్యం, కార్యదర్శి నవీన్ గ్రామస్తులు ఉన్నారు.

శీత్లా భవాని వేడుకలు

సారంగాపూర్, జూలై, 23 : మండలంలోని రేచపల్లి మ్యాడారం తండాలో మంగళవారం శీత్లా భవాని పండుగను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమ ఆరాధ్య దైవమైన శీత్ల భవాని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి పంటలు, పిల్ల పాపలు చల్లంగా ఉండాలని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వారి సాంప్రదాయ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భూక్య జవహర్ నాయక్ (ఏడీఈ), భూక్య కాసీరాం, మాజీ జడ్పీటీసీ భూక్యసరళ సురేందర్ నాయక్, మార్క్‌ఫెడ్ డీఎం దివ్య భారతి, మాజీ సర్పంచ్ అరుణ్, నాయకులు తిరుపతి నాయక్, ప్రకాష్, జహిందర్, ప్రభాకర్, పురుషోత్తం, శంకర్, వాసు, మనోహర్, కిషన్ పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో అధికారుల తనిఖీలు



రైస్‌మిల్ తనిఖీ చేస్తున్న అధికారులు

వెల్గటూర్, జూలై 23: మండలంలోని అంబారిపేట, సంకెనపెల్లి శివారులోని రైస్ మిల్లుల్లో జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్, తహసీల్దార్ శేఖర్, సివిల్ సప్లై డీటీ శ్రీనివాస్, ఆర్ఐ రాజేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 2023 సంవత్సరం టెండర్ ప్యాడీకి సంబంధించి రైస్ మిల్లులో సీఎంఆర్ రూపంలో క్వింటాల్‌కు రూ.2223 చొప్పున ప్రభుత్వానికి చెల్లించే డబ్బుల్లో భారీగా తేడా వచ్చినట్లు అధికారులు తెలిపారు. అంబారిపేట శ్రీరామ రైస్ మిల్లులో సుమారు రూ.1.39 కోట్లు విలువ గల 625 మెట్రిక్ టన్నుల ధాన్యం, సంకె నపల్లి రాజ రాజేశ్వర రైస్ మిల్లులో రూ.76.47 లక్షల విలువ గల 344 మెట్రిక్ టన్నుల ధాన్యం తేడా వచ్చినట్లు అధికారులు గుర్తించినట్లు పేర్కొన్నారు. సీఎంఆర్ కోసం తీసుకునే ధాన్యానికి ప్రభుత్వానికి క్వింటాల్‌కు రూ.2223 చొప్పున చెల్లించే ధర తమకు గిట్టుబాటు కావడం లేదని అందుకే సీఎంఆర్ చెల్లించడంలో ఆలస్యం అవుతున్నట్లు రైస్ మిల్లర్లు పేర్కొన్నారని తెలిపారు.

టెండర్ గడువు లోగా తేడా వచ్చిన ధాన్యం డబ్బులను ప్రభుత్వానికి చెల్లించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని మిల్లర్లను అధికారులు హెచ్చరించారు.

మల్లాపూర్ : మండలంలోని రైస్‌మిల్లులను మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర సివిల్ సప్లై అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని మొగిలిపేట, సాతారం, గుండంపల్లి గ్రామాల్లోని రైస్‌మిల్లులను తహసీల్దార్ వీర్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. రైస్‌మిల్లులోని ధాన్యం, బియ్యం సంచులు, రికార్డులును తనిఖీ చేశారు. ప్రభుత్వంకు ఇవ్వాల్సిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైస్‌లలో సేకరించిన వివరాల నివేదికను ఉన్నత అధికారులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

బీజేపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

కోరుట్ల, జూలై 23 : బీజేపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కోరుట్ల మండల బీజేపీ ముఖ్య కారకర్తల సమావేశం బీజేపీ మండల అధ్యక్షుడు చిన్న మెట్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు పంచరి విజయ్ అధ్యక్షతన జరుగగా వివిధ అంశాలలపై చేయవలసిన కార్యక్రమాలపై ఏకగ్రీవ తీర్మానం చేసారు. ఈ సందర్భంగా రుద్ర శ్రీనివాస్ సీనియర్ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నిజామాబాదు పార్లమెంట్ పరిధిలోని అన్ని మున్సిపల్‌కు ఎంపీ నిదుల నుంచి సుమారు రూ 563 కోట్లు నిధులు మంజూరుకు కృషి చేసినట్లు తెలిపారు. కోరుట్ల మున్సిపల్‌కు రూ. 37.75 కోట్లు, మెట్‌పల్లి మున్సిపల్‌కు రూ. 35 కోట్ల నిదులు అమృత్ జల్ పరియోజన 2.0 పథకం ద్వార మంజూరు చేసాడని తెలిపారు. నిధులు మంజూరికి కృషి చేసిన ఎంపీ అర్వింద్ మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్‌నగర్ మాజీ సర్పంచ్ తుక్కారం గౌడ్, బీజేపీ నాయకులు సంకు నరేందర్, రాజేంధర్, గణేష్, విఠల్ రాజేంధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి,రాజు, ద్యానణపల్లి భూమా నందంలతో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అల్ఫోర్స్‌లో ఆకట్టుకున్న బోనాల జాతర

జగిత్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని కృష్ణానగర్‌లో గల అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో ఆషాడ మాసం పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో బోనాల జాతర నిర్వహించారు. బోనాల జాతర సందర్భంగా ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన శ్రీ నవదుర్గా చిత్రపటానికి పూలమాల వేసి ఉత్సవాలను రెట్టింపు ఉత్సాహంతో ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల ఆల్ఫోర్స్ స్కూల్‌లో మంగళవారం బోనాల వేడుకలు నిర్వహించారు. తెలంగాన సంస్కృతికి అద్దం పట్టి బోనాల పండుగ విశిష్టతను తెలిపే విధంగా విద్యార్థుల సంప్రదాయ దుస్తుల్లో దప్పుచ ప్పులు, శివసత్తులు, పోతరాజుల విన్యాసాలతో బోనాల వేడుకలను జరుపగా వేడుకల్లో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి అమ్మ వారికి పూజలు నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు





జగిత్యాల, మల్యాలలో బోనాల వేడుకల్లో పాల్గొన్న నరేందర్‌రెడ్డి